క్లుప్తంగా

సఖినేటిపల్లి రేవు బంద్



సఖినేటిపల్లి, నర్సాపురం రేవులో పంటు సేవలు నిలిచిపోవడంతో బోసిపోయిన రేవు

సఖినేటిపల్లి: సఖినేటిపల్లి, నర్సాపురం రేవును ఆదివారం మధ్యాహ్నం నుంచి పశ్చిమగోదావరి జిల్లా అధికారులు బంద్ చేశారు. భారీ వర్షాలకు ఎగువ ప్రాంతాల నుంచి దిగువకు వస్తున్న నీటి ప్రవాహం ఉధృతిని బట్టి ముందస్తు చర్యల్లో భాగంగా గోదావరి నదిపై పంటు, నాటుపడవల రాకపోకలను నిలుపుదల చేస్తూ పశ్చిమగోదావరి జిల్లా అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. కాగా రేవు వద్ద ప్రస్తుతం ఉన్న పరిస్థితులు అవగాహన లేకపోవడంతో బస్సుల్లో రేవు వద్దకు వెళ్లిన ప్రయాణికులు తిరుగుముఖం పడుతున్నారు. దీంతో ఎపుడూ రద్దీగా ఉండే రేవు బోసిపోయింది.

ముంపు నీటి మళ్లింపునకు కచ్చా డ్రైన్లు

మామిడికుదురు: భారీ వర్షాల వల్ల గ్రామాల్లో నిలిచి పోయిన ముంపు నీటిని మళ్లించేందుకు పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టారు. దీనిలో భాగంగా ఆదివారం కచ్చా డ్రైన్లు తవ్వించారు. గెద్దాడ, పెదపట్నంలంక, తదితర గ్రామాల్లో కచ్చా డ్రైన్లు ఏర్పాటు చేసి వాటి ద్వారా ముంపునీటిని మళ్లిస్తున్నారు. వీటితో పాటు బి.దొడ్డవరం నుంచి పెదపట్నంలంక వెళ్లే ఆర్ అండ్ బీ రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. ఆయా గ్రామ పంచాయతీల కార్యదర్శులు పీవీఎస్‌వీ ప్రసాద్, డి.సురేష్ ఆధ్వర్యంలో ఆయా గ్రామాలకు చెందిన ప్రజా ప్రతినిధులు ఈ పనులను పర్యవేక్షిస్తున్నారు.

వరద బాధితులకు అండగా నిలుస్తాం

మామిడికుదురు: గోదావరి వరద బాధితులకు అండగా నిలుస్తామని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పేర్కొన్నారు. ఎమ్మెల్యే ఆదివారం వరద ప్రభావిత గ్రామాలైన అప్పనపల్లి, పెదపట్నంలంక, బి.దొడ్డవరం గ్రామాల్లో పర్యటించారు. ఆ గ్రామాల్లో నదీ కోతకు గురవుతున్న లంక భూములను పరిశీలించారు. గోదావరి కోత నివారణకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు. కోట్లాది రూపాయలు విలువైన సారవంతమైన భూములు గోదావరి నదిలో కూలిపోతున్నాయని వాపోయారు. నెల నెలా ఆదాయాన్నిచ్చే కొబ్బరిచెట్లు నదిలో పడిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కోత నివారణకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే సత్యనారాయణ హామీ ఇచ్చారు. పెదపట్నం గ్రామంలో గురు పౌర్ణమి సందర్భంగా షిర్డీ సాయిబాబాను ఎమ్మెల్యే దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ఆయనను సత్కరించింది. ఆయన వెంట సర్పంచ్‌లు సుందరనీడి చిన్ని, అడబాల తాతకాపు, ఎంపీటీసీలు కొమ్ముల జంగమయ్య, వాసంశెట్టి వెంకటరమణ, జనసేన మండల శాఖ అధ్యక్షుడు జాలెం శ్రీనివాసరాజు, కంకిపాటి నర్సింహారావు, తదితరులు ఉన్నారు.

వరద తాకిడి గ్రామాల్లో పర్యటన



సఖినేటిపల్లి వద్ద గోదావరి పాయపై నిర్మించిన కాజ్ వే వద్ద పరిస్థితిని పరిశీలించిన అధికారులు

సఖినేటిపల్లి: గోదావరి వరద ఉధృతితో మండలంలో ముమ్మందు వరద తాకిడికి గురయ్యే గ్రామాల్లో ఆదివారం మండల స్థాయి అధికారులు పర్యటించారు. ఆయా గ్రామాల ప్రజలను అప్రమత్తం చేస్తూ వారు పలు సూచనలు చేశారు. ఈ మేరకు ఎంపీడీవో పీవీ సత్యనారాయణ, తహసీల్దారు సీహెచ్ పెద్దిరాజు, డీటీ సీహెచ్ భాస్కర్‌లు టేకిశెట్టిపాలెం, అప్పనరామునిలంక, సఖినేటిపల్లిలంక, సఖినేటిపల్లి వద్ద గోదావరి పాయపై కాజ్ వే పైన, సఖినేటిపల్లి లాకుపేట తదితర ఏరియాల్లో పర్యటించారు. రేపూరి ఏసు నరసింహ రాజా, వీఆర్వోలు, వీఆర్ఏలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వరదనీట మునిగిన కనకాయలంక కాజ్‌వే

పి.గన్నవరం: చాకలిపాలెం శివారు కనకాయలంక కాజ్‌వే శనివారం సాయంత్రం వరద నీట మునిగింది. దీంతో ఆ గ్రామ ప్రజలు రెండు అడుగుల ఎత్తున వరదనీటిలో రాకపోకలు సాగిస్తున్నారు. శనివారం రాత్రికి కాజ్‌వే పై మరింత వరద ఉధృతి పెరిగే అవకాశం ఉండటంతో ప్రజల రాకపోకల కోసం పడవలను సిద్ధం చేసినట్టు ఆగ్రామ వీఆర్వో లక్ష్మి తెలిపారు. వశిష్ట, వైనతేయ నదీపాయల్లో వరద ఉధృతి పెరుగుతుండటంతో లంక గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఒక వైపు వరద, మరో వైపు వర్షాలతో ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని ఊడిమూడిలంక, జి.పెదపూడి లంక, అరిగెలవారిపేట, బూరుగులంక గ్రామాల ప్రజలు పడవలపై ప్రయాణిస్తున్నారు. లంకలు వరద నీట మునుగుతుండటంతో పాడి రైతులు పశువులను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు.

క్షతగాత్రులకు రక్షణగా సాస్

- ప్రమాద బాధితులకు సకాలంలో వైద్యం
- 1033 టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు
- సేవలపై వాహనదారుల సంతృప్తి



జాతీయ రహదారి ప్రయాణికులకు సత్వర సేవలు అందించేందుకు ఏర్పాటు చేసిన అంబులెన్స్

ఆలమూరు: జాతీయ రహదారి 216 ఏ (హైవే)లో ప్రమాదాల నివారణకు, క్షతగాత్రులకు సరైన సమయంలో సత్వర చికిత్సను అందించేందుకు హైవే అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. రహదారిపై ఏ విధమైన ప్రమాదం జరిగినా క్షణాల్లో సంఘటన స్థలానికి చేరుకుని సత్వరం ప్రాథమిక చికిత్సను అందించి సమీప ఆస్పత్రికి తరలిస్తున్నారు. అందులో భాగంగా ప్రమాదాలు సంభవించినప్పుడు క్షతగాత్రులకు సత్వర సేవలను అందించేందుకు వీలుగా సరికొత్త సాంకేతిక పరిజ్ఞాన వ్యవస్థతో పాటు అధునాతన సౌకర్యాలతో ఏర్పాటు చేసిన బేసిక్ లైవ్ సపోర్ట్ (బీఎల్ఎస్) అంబులెన్స్ ప్రయాణికులకు, వాహనదారులకు విశేష సేవలను అందిస్తుంది. తూర్పు గోదావరి జిల్లా దివాన్ చెరువు నుంచి పశ్చిమగోదావరి జిల్లా సిద్ధాంతం వరకూ 60 కిలోమీటర్ల మేర పరిధిలో ఈ అంబులెన్స్ అందుబాటులో ఉంటుంది. జాతీయ రహదారిలో అత్యధికంగా ఆలమూరు మండలానికి సంబంధించి సుమారు 18 కిలోమీటర్ల పరిధి ఉంది. మొబైల్ ద్వారా 1033 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి వివరాలు తెలియజేసినా సత్వరమే అంబులెన్స్ ముంగిట ఉంటుంది. దీంతో పాటు ఇప్పటికే జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదాన్ని సకాలంలో గుర్తించి క్షతగాత్రులకు, బాధితులకు సత్వర సేవలు అందించేందుకు సేవ్ అవర్ సోల్ (సాస్) పేరిట టెలిఫోన్ గుర్తుతో ఎమర్జెన్సీ కాల్ బాక్సు (ఈసీబీ)లు ఏర్పాటు ఇప్పటికే జరిగింది. టోల్ ఫ్రీ నంబరు తెలియని ప్రయాణికులు ప్రమాదం జరిగిన వెంటనే హైవే పక్కన ఎర్రటి బాక్సు ఆకారంలో ఉండే ఈసీబీ వద్దకు వచ్చి బటన్ నొక్కితే హైవే కంట్రోల్‌కు సమాచారం వెళుతుంది. ఆ కంట్రోల్ రూమ్ నుంచి వెంటనే ఈసీబీకి ఫోన్ చేసి ఫిర్యాదు చేసిన ప్రయాణికుడి నుంచి వివరాలను సేకరిస్తుంది. దీంతో ఆ ప్రదేశానికి కొన్ని నిమిషాల వ్యవధిలోనే హైవే సిబ్బంది పాటు అంబులెన్స్ వేగంగా చేరుకుని సత్వరమే వైద్య సేవలను అందిస్తుంది. అలాగే ట్రాఫిక్ ఇబ్బందులుంటే తొలగించి క్షతగాత్రులను మెరుగైన వైద్యం సేవలు కోసం ఆస్పత్రికి తరలిస్తుంది. గతంలో మాదిరిగా హైవేకు సంబంధించి నంబర్లు వెతుక్కుని ఫోన్ చేయాల్సిన అవసరం లేకుండా హైవే అథారిటీ ఈ ప్రక్రియను చేపట్టింది. ప్రతి రెండు కిలోమీటర్ల మేర టెలిఫోన్ మాదిరిగా 140 ఈసీబీలను అందుబాటులోకి తీసుకువచ్చింది.

ప్రాణాలను రక్షించే బేసిక్ లైవ్ సపోర్ట్ అంబులెన్స్

హైవే ప్రమాద భాదితుల ప్రాణాలు కాపాడే ఈ అంబులెన్స్‌ను హైవే అధికారగణం బేసిక్ లైవ్ సపోర్ట్ అంబులెన్స్‌గా పిలుస్తున్నారు. 2022 అక్టోబర్‌లో రూ.35 లక్షలతో కొనుగోలు చేసిన అధునాతన సౌకర్యాలతో కూడిన అంబులెన్స్ మినీ ఆపరేషన్ థియేటర్ మాదిరిగా సేవలను అందిస్తుంది. రోడ్డు ప్రమాదాలు జరిగేటప్పుడు క్షతగాత్రుల రక్తస్రావ నివారణన సత్వరం అరికట్టేందుకు వీలుగా ప్రత్యేక పరికరాలు నిక్షిప్తమై ఉన్నాయి. అలాగే గుండెపోటుకు గురైన రోగులకు అధునాతనమైన డిఫిబ్రిలేషన్ మెషీన్ అందుబాటులో ఉంది. ఒకేసారి ఇద్దరు క్షతగాత్రులను తరలించే విధంగా రెండు బెడ్‌లు, ఆక్సిజన్ సిలిండర్లు అమర్చబడ్డాయి. ప్రాథమిక చికిత్సను అందించేందుకు వీలుగా అంబులెన్స్‌లో డ్రైవర్‌తో పాటు ఇద్దరు ఆరోగ్య నిపుణులు ఉంటారు.



జొన్నాడలో ఏర్పాటు చేసిన ఎమర్జెన్సీ కాల్ బాక్సు (ఈసీబీ)

ప్రయాణికుల ప్రాణాలకు రక్షణ బాధ్యత

జాతీయ రహదారిలో ప్రమాదానికి గురైన ప్రయాణికులకు సత్వర సేవలను అందించి ప్రాణాలను రక్షించేందుకు ఎన్‌హెచ్ఏఐ బీఎల్ఎస్ అంబులెన్స్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈఅంబులెన్స్‌కు వేగ పరిమితి అధికంగా ఉండటం వల్ల ప్రమాదం జరిగిన కొద్ది నిమిషాల్లోనే సంఘటన స్థలానికి చేరుకునే విధంగా అంబులెన్స్ పార్కింగ్‌ను ఏర్పాటు చేశాం.

– కె.సత్యనారాయణరెడ్డి, టోల్ ప్లాజా మేనేజర్, ఈతకోట

అస్తవ్యస్తంగా పారిశుధ్యం



అంబాజీపేట కేవీ పాలెంలో పాఠశాల ఎదురుగా రోడ్డు పక్కనే పేరుకుపోయిన చెత్తాచెదారం

అంబాజీపేట: మండలంలో ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారింది. మాచవరం, పుల్లేటికుర్రు, కె.పెదపూడి, ముక్కామల, ఇరుసుమండ, వాకలగరువు తదితర గ్రామాల్లో పారిశుధ్య వ్యవస్థ అధ్వానంగా ఉండటంతో దోమలు విపరీతంగా పెరిగిపోయాయి. అంతే కాకుండా ఆ చెత్తా, చెదారం నుంచి దుర్వాసన వెదజల్లడంతో చుట్టుపక్కల వారు, ప్రయాణికులు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అంబాజీపేట సెయింట్ మేరీ స్కూల్ పక్కన, స్త్రీల ఆస్పత్రికి వెళ్లే రహదారిలోను, కొర్లపాటివారిపాలెం ప్రాథమిక పాఠశాల వద్ద పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించడంలో పంచాయతీ పాలకవర్గం, అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ఈ నెల 15న ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోలేదని వాపోయారు. కనీసం బ్లీచింగ్ పౌడర్ చల్లడం, దోమల వ్యాప్తి నివారణకు చర్యలు తీసుకోవడం వంటి ప్రాథమిక చర్యలకు కూడా ఉపక్రమించకపోవడం గమనార్హం. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు, ప్రతినిధులు స్పందించి పారిశుధ్య పనులు చేపట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

అధైర్యపడొద్దు.. క్షేమంగా తీసుకువస్తాం



ఇసుకపూడిలో వీరేంద్రకుమార్ తల్లిదండ్రులకు ధైర్యం చెబుతున్న ఆర్డీవో సత్యనారాయణ

అంబాజీపేట: ఏజెంటు చేసిన మోసం వల్ల సౌదీ అరేబియాలో అష్టకష్టాలు పడుతున్న యువకుడ్ని భారత రాయబారి కార్యాలయం ద్వారా తీసుకువచ్చి కుటుంబ సభ్యులకు అప్పగిస్తామని కొత్తపేట ఆర్డీవో జీవీవీ సత్యనారాయణ చెప్పారు. ఇసుకపూడి శివారు మెరకపేటకు చెందిన సరెళ్ల వీరేంద్రకుమార్ మధ్యవర్తి, ఏజెంట్ల ద్వారా ఖతార్‌కు బదులు సౌదీ అరేబియా వెళ్లి మోసపోయిన విషయం తెలిసిందే. కోనసీమ జిల్లా కలెక్టర్ వి.మహేష్‌కుమార్ ఆదేశాల మేరకు ఆర్డీవో వీరేంద్రకుమార్ కుటుంబ సభ్యులను ఆదివారం కలసి మనోధైర్యం కల్పించారు. ఆర్డీవో మాట్లాడుతూ వీరేంద్రకుమార్ కథనం సామాజిక మాధ్యమాలు, పత్రికల్లో రావడంతో స్థానిక ప్రజాప్రతినిధులు, రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమయ్యారన్నారు. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం కేంద్ర రాయబార కార్యాలయాన్ని సంప్రదించిందని త్వరలో వీరేంద్రకుమార్‌ను క్షేమంగా తీసుకువచ్చేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. మీరెవ్వరూ అధైర్యపడొద్దని వీరేంద్రకుమార్ తల్లిదండ్రులు సత్తిరాజు, మరియమ్మ, సోదరుడు రవికుమార్‌లకు భరోసా ఇచ్చారు. ఆయన వెంట సర్పంచ్ తరపట్ల మోహన్‌సింగ్ బాబురావు, ఎంపీటీసీ ముత్తాబత్తుల ప్రశాంత్, తహసీల్దార్ జె.వి మలకుమారి, ఆర్ఐ ఎండీ ఇబ్రహీం, వీఆర్వో వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన స్ఫూర్తితో యువత ముందడుగు

రాజోలు: రక్తదానం చేయడం ద్వారా ప్రాణదానం చేసినట్టేనని రక్తదాన స్ఫూర్తితో పొదలాడకు చెందిన యువకులు ముందడుగు వేశారని ఏ1 సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు చెల్లుబోయిన శ్రీనివాస్ అన్నారు. ఆదివారం పొదలాడలో యువరత్న ఎన్టీఆర్ సేవా సమితి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. అమలాపురం ప్రభుత్వ బ్లడ్ బ్యాంక్ పర్యవేక్షణలో వివిధ గ్రూపుల రక్తాన్ని సేకరించారు. 2004లో సేవాసమితి స్థాపించి రెండు దశాబ్దాలుగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఏటా రక్తదాన శిబిరాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. ఏ1 సేవాసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు చెల్లుబోయిన శ్రీనివాస్‌తో పాటు పలువురు యువకులు రక్తదానం చేశారు. అలాగే జనసేన పార్టీ నాయకులు పంచదార చినబాబు 33వ సారి రక్తదానం చేయగా, అప్పనపల్లి గ్రామానికి చెందిన వీధి సత్తిబాబు 59వ సారి రక్తదానం చేశారు. యువరత్న ఎన్టీఆర్ సేవా సమితి అధ్యక్షుడు వాసంశెట్టి రామకృష్ణ, కార్యదర్శి అప్పారి దుర్గా ప్రసాద్, నాయకులు కంబాల చంద్రరావు, చెల్లుబోయిన రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం వద్దు

మలికిపురం: రానురానూ విద్యార్థుల ప్రాణాలు అంటే లెక్కలేని విధంగా ప్రైవేట్ విద్యాసంస్థల యజమానులు చూస్తున్నారని, ధనార్జనే ధ్యేయంగా ఎంచుకుని విద్యార్థుల ప్రాణాలపై తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర నాయకుడు, న్యాయవాది దేవ రాజేంద్రప్రసాద్ అన్నారు. మలికిపురంలో ఆదివారం జరిగిన సమావేశంలో కొన్ని కండిషన్లో లేని బస్సులు, వ్యాన్లు, ఆటోలలో విద్యార్థులను తరలించడం వలన అనేక ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. రవాణా శాఖ అధికారుల పర్యవేక్షణ కూడా కరువైందని, తక్షణమే ప్రభుత్వాధికారులు స్పందించి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘ నాయకులు రాపాక మహేష్, తాడి రవీంద్ర, నక్క సంజయ్, తాడి సహదేవ్ తదితరులు పేర్కొన్నారు.

నిత్యాన్నదాన పథకానికి రూ.11,116 విరాళం



దాత శ్రీనివాసరావుకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న అర్చకులు

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరస్వామివారి ఆలయంలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన పథకానికి విజయవాడకు చెందిన చిన్ని శ్రీనివాసరావు ఆదివారం రూ.11,116 విరాళం అందజేశారు. ఈ సొమ్మును అర్చకులకు అందజేశారు. దాతను స్వామివారి శేషవస్త్రాలతో సత్కరించి స్వామి చిత్రపటం ప్రసాదం అందజేశారు. దాతను ఆలయ సిబ్బంది అభినందించారు.

వాసవీమాతకు ఆషాఢ సారె



అంబాజీపేటలో వాసవీ మాతకు సారె సమర్పిస్తున్న మహిళలు

అంబాజీపేట: ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని అంబాజీపేట ఆర్యవైశ్య మహిళా సంఘం ఆధ్వర్యంలో వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారికి ఆషాఢ సారెను ఆదివారం అందజేశారు. మహిళా సంఘం కన్యకా పరమేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. 150 మంది మహిళలు సమకూర్చిన 31 రకాల స్వీట్లు, పండ్లు, వస్త్రాలతో అమ్మవారికి సారె సమర్పించామన్నారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలో లలితా సహస్రం పారాయణ చేశారు. అనంతరం మహిళలకు అమ్మవారి సమర్పించిన సారెను పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ అమ్మవారి అనుగ్రహం అందరికీ ఉండాలని, సకాలంలో వర్షాలు పడాలని, రైతులు పాడి పంటలతోను, వ్యాపార సంస్థలు అభివృద్ధితో, ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని అమ్మవారిని కోరామని చెప్పారు.

ప్రతిభావంతులకు అండగా నిలవడం ముదావహం



విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందిస్తున్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

మామిడికుదురు: ప్రతిభావంతులైన విద్యార్థులకు అండగా నిలవడం ముదావహమని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పేర్కొన్నారు. మామిడికుదురు అంబేడ్కర్ సామాజిక భవనంలో ఆదివారం రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం సమావేశం జరిగింది. సంఘం ఆధ్వర్యంలో 57 మంది ఎస్సీ, ఎస్టీ ప్రతిభావంతులైన విద్యార్థులకు ఎమ్మెల్యే ద్వారా రూ.1.50 లక్షల ఆర్థిక సహాయంతో పాటు ప్రతిభా పురస్కారాలు అందించారు. షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం అందిస్తున్న సేవలను ఆయన అభినందించారు. ప్రతిభా పురస్కారాలు విద్యార్థుల్లో పోటీతత్వాన్ని పెంచుతాయన్నారు.

సమావేశంలో సంఘం అధ్యక్షులు భూపతి మనోహర్‌రాజు, ప్రధాన కార్యదర్శి కారుపల్లి కళ్యాన్‌బాబు, ఆర్థిక కార్యదర్శి నేల శ్రీనివాసరావు, కార్యవర్గ సభ్యులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

వైభవంగా గురుపౌర్ణమి వేడుకలు



కొత్తపేటలో రిటైర్డ్ ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులను సత్కరిస్తున్న సమితి సభ్యులు

మామిడికుదురు/అంబాజీపేట/పి.గన్నవరం/ఆలమూరు/అయినవిల్లి/సఖినేటిపల్లి/కొత్తపేట: గురుపౌర్ణమి వేడుకలను వివిధ మండలాల్లో వైభవంగా నిర్వహించారు. వాకలగరువులో సంతాన సిద్ధివినాయక దత్తాత్రేయ షిరిడీ సాయిబాబాకు స్థానిక భక్తుడు పేరాబత్తుల లక్ష్మీనారాయణ (ఆర్టిస్ట్ కళ్యాణ్‌తేజ) ఆధ్వర్యంలో 4 కేజీలు, రూ.9 వేలు విలువైన జీడిపప్పు దండను ఆదివారం అలంకరించారు. పి.గన్నవరం అక్విడెక్టు వద్ద వేంచేసిన షిర్డీ సాయిబాబా వారి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఉభయ గోదావరి జిల్లాల్లో ప్రథమ ఆలయంగా ప్రసిద్ధి గాంచిన ఆలమూరులోని షిర్డీసాయి ఆలయంలో స్వామికి పండ్ల రసాలు, వివిధ రకాల పూలతో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. సఖినేటిపల్లి మండలం రామేశ్వరంలో షిర్డీ సాయిబాబా ఆలయంలో మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు ప్రత్యేక పూజలు చేశారు. కొత్తపేట మండలంలో గురు పౌర్ణమి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వాడపాలెంలో వరసిద్ధి వినాయకస్వామి, దత్తాత్రేయ స్వామి–షిర్డీసాయిబాబా వారికి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అర్చకుడు పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామానికి చెందిన గురువులను సత్కరించారు.

ఆదిగురువు వ్యాసమహర్షి



నల్లచెరువు అంతర్జాతీయ శ్రీకృష్ణమందిర్‌లో వ్యాస పూర్ణిమ పూజలు చేస్తున్న భక్త బృందం

అయినవిల్లి: గురు పరంపర వ్యాసమహర్షితోనే ప్రారంభమైందని, వ్యాస మహర్షి ఆది గురువుగా పూజలందుకుంటున్నారని నల్లచెరువు అంతర్జాతీయ శ్రీకృష్ణ మందిర్ నిర్వహకుడు ప్రభూ సుందర శ్రీనివాసదాస్ అన్నారు. ఆదివారం వ్యాసపౌర్ణమి సందర్భంగా వ్యాసమహర్షి, ప్రభూ పాదుల వారికి ప్రత్యేక పూజలు చేశారు. ప్రభూ వ్యాసపౌర్ణమి ప్రత్యేకతను వివరించారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని ఈ సందర్భంగా శ్రీకృష్ణ నామ మంత్రాన్ని స్మరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నప్రసాదాన్ని భక్తులు స్వీకరించారు. అన్నప్రసాదానికి నేదునూరుకు చెందిన జోగి విశ్వేశ్వరరావు దంపతులు రూ.10 వేలు, చిక్కాల గోపాలరావు దంపతులు రూ.3111 అందజేశారు.

శాకంబరిగా దుర్గమ్మ



అంబాజీపేటలో శాకంబరిగా కనకదుర్గమ్మ



ఆలమూరులో శాకంబరిగా దర్శనమిచ్చిన రావులమ్మ



శాకంబరిగా బి.సావరం దుర్గాదేవి అమ్మవారు

అంబాజీపేట: ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని అంబాజీపేట పశువుల మార్కెట్ వద్ద వేంచేసిన విజయ కనకదుర్గ అమ్మవారు శాకంబరిగా ఆదివారం భక్తులకు దర్శనమిచ్చారు. స్థానికులు, భక్తులు సమకూర్చిన వివిధ రకాల కూరగాయలతో అమ్మవారిని కనులవిందుగా అలంకరించారు. ఆలయ అర్చకులు చంద్రమౌళి సూర్య కామేశ్వర శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

శాకంబరిగా రావులమ్మ

ఆలమూరు: గ్రామ దేవత రావులమ్మ అమ్మవారు ఆదివారం శాకంబరి మాతగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆషాఢమాసం పౌర్ణమి పర్వదిన సందర్భంగా అమ్మవారికి పరిసర గ్రామాల నుంచి విచ్చేసిన మహిళ భక్తబృందం రికార్డు స్థాయిలో సుమారు 400 కిలోల వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలతో అమ్మవారిని అలంకరించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలోఆలయ అర్చకులు వేదుల లక్ష్మణ శర్మ నేతృత్వంలో వేద పండితులు మంత్రోచ్ఛారణల మధ్య కుంకుమ పూజలు, గణపతి హోమం జరిగాయి.

శాకంబరిగా కనకదుర్గాదేవి దర్శనం

కొత్తపేట: స్థానిక బొరుసువారిసావరంలో వేంచేసియున్న విజయకనకదుర్గాదేవి అమ్మవారు ఆదివారం శాకంబరిగా దర్శనమిచ్చారు. ఆషాఢమాసం సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకుడు బిక్కవోలు సత్యనారాయణాచార్యులు, వేదపండితుడు అనంత లక్ష్మణకుమారాచార్యులు అమ్మవారిని కూరగాయలు, ఆకుకూరలు, పండ్లతో విశేషంగా అలంకరించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. ఆషాఢ పౌర్ణమి తిథి పురస్కరించుకుని మహిళలు సామూహికంగా కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం ప్రసాద వితరణ, భారీ ఎత్తున అన్నసమారాధన జరిపారు.

ఆందోళన కలిగిస్తున్న గోదావరి వరద



పాశర్లపూడి బ్రిడ్జి వద్ద పరవళ్లు తొక్కుతున్న గోదావరి

మామిడికుదురు: గోదావరి వరద తీర గ్రామాల ప్రజలను ఆందోళనకు గురిచేస్తోంది. గోదావరి నది పరీవాహక ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలు లంక గ్రామాల ప్రజల్ని తీవ్రంగా కలవర పెడుతున్నాయి. అప్పనపల్లి బాలబాలాజీ స్వామి వారి స్నానఘట్టంతో పాటు పాశర్లపూడిబాడవ వైనతేయ వారధి వద్ద ఆదివారం గోదావరి నది ఉధృతంగా ప్రవహిస్తోంది. పెదపట్నం మధ్య లంకలో పశుగ్రాసం నీట మునిగింది. గంట గంటకూ వరద ఉధృతి పెరుగుతుండడంతో పాశర్లపూడి కరకట్ట దిగువన ఉన్న కాజ్‌వేకు ముంపు ప్రమాదం పొంచి ఉంది. ఈ కాజ్‌వేకు ఇరువైపులా వరద నీరు వచ్చి చేరింది. ఈ కాజ్‌వే ముంపునకు గురైన పక్షంలో అప్పనపల్లి, బి.దొడ్డవరం, పెదపట్నం లంక గ్రామాలకు రోడ్డు రవాణా స్తంభించిపోయే అవకాశం ఉంది. తీర గ్రామాల ప్రజల్ని అధికారులు ఇప్పటి నుంచే వరద హెచ్చరికలతో అప్రమత్తం చేస్తున్నారు.

వృద్ధగౌతమిపాయలో వరద ఉధృతి

అయినవిల్లి: మండలంలోని ముక్తేశ్వరంలోని వృద్ధగౌతమిపాయలో వరద ఉధృతిగా ప్రవహిస్తుంది. ఈ పాయలో పాతవంతెన పూర్తిగా మునిగింది. దీంతో ఈ వంతెన పై రాకపోకలు ఆగిపోయాయి. అలాగే లంక గ్రామాలైన మడుపల్లిలంక, చింతనలంక, వీరవల్లిపాలెం, అయినవిల్లిలంక, పొట్టిలంక, కొండుకుదురులంక, తొత్తరమూడిలోని కె.పెదలంక గ్రామాల్లో లోతట్టు ప్రాంతాల్లోకి వరదనీరు చేరింది. కూరగాయ, అరటి, కోకో, తమలపాకు వంటి పంటలు వరదనీట మునిగాయి.

రోటరీ క్లబ్ నూతన కార్యవర్గం ప్రమాణం



నూతనంగా ఎన్నికైన రాజోలు రోటరీ కార్యవర్గాన్ని అభినందిస్తున్న రొటేరియన్లు

రాజోలు: ప్రపంచ వ్యాప్తంగా రోటరీ క్లబ్ సేవలు విస్తతంగా కొనసాగుతున్నాయని రోటరీ గవర్నర్ వై.కల్యాణచక్రవర్తి అన్నారు. ఆదివారం స్థానిక రోటరీ క్లబ్ సమావేశ మందిరంలో రాజోలు రోటరీ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకార వేడుకలు ఘనంగా నిర్వహించారు. రాజోలు రోటరీ క్లబ్ అధ్యక్షుడిగా కాసు శ్రీనివాస్, కార్యదర్శిగా కోదాటి సోమరాజు, కోశాధికారిగా నామన షణ్ముఖేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా దార్ల పెదబాబు, సంయుక్త కార్యదర్శిగా మొహిద్దీన్, కార్యనిర్వాహక కార్యదర్శిగా ఏడిద కవీంద్రలతో పాటు సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. రాజోలు చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడిగా, రాజోలు ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడిగా సేవలు అందిస్తూ రోటరీ క్లబ్ అధ్యక్షుడిగా ఎన్నికైన కాసు శ్రీనివాస్‌ను స్థానిక నాయకులు అభినందించారు. సమావేశంలో రోటరీ గవర్నర్ వై.కల్యాణచక్రవర్తి మాట్లాడుతూ రోటరీ స్ఫూర్తితో అనేక స్వచ్ఛంద సంస్థలు ఆపదలో ఉన్న వారికి అండగా నిలుస్తున్నాయన్నారు. అసిస్టెంట్ గవర్నర్ బొరుసు తిరుమలరావు, డాక్టర్ బసవ వరహాలు, రొటేరియన్లు చిట్నీడి లక్ష్మణరావు, నార్కెడిమిల్లి బాలకృష్ణ, బోళ్ల శ్రీనివాస్, ఐ.సూర్యనారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.